క్లుప్తంగా

రూ.20లక్షలతో అభివృద్ధి పనులు



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ప్రధాన రహదారిలో కొత్తగా తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయడంతో కార్పొరేషన్ అధికారులు సిమెంటు రోడ్డును పగులగొట్టారు. ఆ ప్రాంతంలో రోడ్డు మరమ్మతులు, కొత్త డ్రెయిన్ నిర్మించేందుకు బుధవారం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి ప్రధాన రోడ్డులో గతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, రూ.10 లక్షలు కేటాయించి నూతనంగా 600 మీటర్లు పొడవున డ్రైనేజీ నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే తాడేపల్లి ఒకటో వార్డు నుంచి కృష్ణుడి గుడివరకు సుమారు వెయ్యి మీటర్ల పొడవున పైపులైన్ల నిమిత్తం పగులగొట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని పునర్నిర్మిస్తున్నామని, ఇందుకోసం రూ.10లక్షల నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

ఇండియా వలస పాలకులు పెట్టిన పేరు

పాత గుంటూరు: వలస పాలకులు దేశానికి ఇండియా అని పేరుపెట్టారు గానీ తరతరాలుగా మన దేశం భారతదేశమేనని బీజేపీ జాతీయ కార్యదర్శి వై. సత్యకుమార్ తెలిపారు. శివ శంఖారావం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కేసులో ఐటీ, ఈడీ సంస్థలు వాటి పని అవి చేస్తాయని చెప్పారు. భారత్ జోడో యాత్ర చేసిన రాహుల్ గాంధీ నేడు భారత్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

భర్త, అత్త వేధింపులపై కేసు నమోదు

చేబ్రోలు: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న భర్త, అత్తలపై చేబ్రోలు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చేబ్రోలు యడ్లపాటి నగర్ ప్రాంతానికి చెందిన గేరా ప్రవల్లికను దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన గేరా అశోక్‌కు ఇచ్చి ఏడాదిన్నర క్రితం వివాహం చేశారు. కొంత కాలంగా మద్యానికి బానిసైన అశోక్‌ను భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. కొద్ది రోజులుగా అత్త, భర్తలు అదనపు కట్నం తీసుకు రావాలని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. దీనిపై ప్రవల్లిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్కా జూదరుల అరెస్టు

పొన్నూరు: పట్టణంలోని చీరాల బస్ స్టాప్, ఇతర ప్రాంతాలలో మట్కా జూదం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై బి. రామబ్రహ్మం బుధవారం తెలిపారు. వారి వద్ద రూ. 3,500 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు.

అడ్వాన్స్ తీసుకుని మొహం చాటేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి చికెన్ షాపు యజమానిని మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటకు చెందిన షేక్ సాబిల్ వికలాంగుల కాలనీలోని శివమ్మ చికెన్ షాపులో పని చేసేందుకు ఒప్పుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ. 1,50,000 తీసుకుని మొహం చాటేశాడు. సెల్ కూడా స్విచ్చాఫ్ చేశాడు. మోసపోయినట్లు నిర్ధారించుకున్న శివమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హకీం జానీకి సన్మానం

తెనాలిఅర్బన్: వాసవీ క్లబ్ కింగ్స్ సంస్థ వార్షికోత్సవంలో భాగంగా తెనాలికి చెందిన ప్రముఖ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీం జానీని సన్మానించారు. గంగానమ్మపేటలోని సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో క్లబ్ తెనాలి అధ్యక్షుడు పీవీవీ సత్యనారాయణ, కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు చుండూరు రామమోహనరావు, కూనల సుమన్, ఏ నాగమురళీధరరావు, కుసుమాంబ, లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ఆర్కే
- భారీ అన్నదాన కార్యక్రమం



తాడేపల్లి యాదవుల బజారు కృష్ణ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి యాదవుల బజారులో ఉన్న కృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన ఈ పూజల్లో మొట్ట మొదటిగా గోమాతకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ, ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణ మందిరం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ త్రిదండ చిన జీయర్ ఆశ్రమ మేనేజర్ వెంకటాచార్యులు పాల్గొని భక్తులకు తమ సందేశాన్ని అందించారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఉట్టి కొట్టుడు కార్యక్రమంలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మంగళగిరిలో...

మంగళగిరి: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని బుధవారం నగర ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారుజామునే తలంటు స్నానాలు ఆచరించి ఇంటి ముంగిళ్లలో బాలకృష్ణుడు తమ ఇళ్లకు రావాలని శ్రీకృష్ణుని పాదాలతో కూడిన ముగ్గులతో అందంగా అలంకరించారు. శ్రీకృష్ణ భగవానునికి తులసిమాలలతో పూజలు జరిపి నైవేద్యాలు సమర్పించి, సుహాసినులకు తాంబూలాలు ఇచ్చి, అటుకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. తమ చిన్నారులను బాలకృష్ణునిగా అలంకరించి ఆనంద ఉత్సవాలతో పండుగ జరుపుకొన్నారు. దీంతో ఆయా గృహాలు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలతో కళకళలాడాయి.



కృష్ణాష్టమి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న పూజారి



అన్నదానం ప్రారంభిస్తున్న చినజీయర్ స్వామి ఆశ్రమ మేనేజర్ వెంకటాచార్యులు

గంగా భగీరథ కమ్యూనిటీ హాలు ప్రారంభం

- నగర సామాజిక వర్గ ప్రజలు కమ్యూనిటీ హాలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే ఆర్కే
- కార్యక్రమంలో పాల్గొన్న జేసీ, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న జేసీ జి.రాజకుమారి, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: నగర సామాజిక వర్గ ప్రజలు కమ్యూనిటీ హాలును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న గంగా భగీరథ సగర కమ్యూనిటీ హాల్‌ను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గతంలో మురికికూపంగా ఉన్న ఈ ప్రాంతంలో సుమారు రూ.75 లక్షల కార్పొరేషన్ నిధులతో కార్పొరేట్ తరహా కమ్యూనిటీ హాల్ నిర్మించుకుని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్థానికుల నుంచి వచ్చిన వినతి మేరకు గంగా భగీరథ సగర కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఈ ప్రాంతంలో అధికంగా నివసించే సగర సామాజికవర్గ సోదరులకు ఇది ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగించేలా సమాజంలో అందరిలో సమానత్వం ఉండేలా చిన్న చిన్న కులాలకు సైతం గుర్తింపు, గౌరవాన్ని కల్పిస్తూ ఇటువంటి నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఆయా ప్రాంతాల్లో ఉండే సామాజిక వర్గ ప్రజలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారి వివాహ శుభకార్యాలతో పాటు ఇతర అవసరాలకు సంబంధించి కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు చేయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ యు.శారదాదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆప్కో మాజీ ఛైర్మన్ గంజి చిరంజీవి, గంగా భగీరథ సగర సంఘం అధ్యక్షుడు పందేటి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి జూట్రు ఏడుకొండలు, సంఘం నాయకులు గండికోట అచ్చయ్య, కలవకొల్లు గోపి, నంగళం ప్రసాద్, కర్నాటి శివ సత్యనారాయణ, కఠారి విష్ణుమూర్తి, దుంపల సోములు, గండికోట రాజారావు, వీర రాఘవులు, కగ్గా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

మంగళగిరి: కరోనా కాలంలో ఆక్సిజన్ ఎంత విలువైందో అందరికీ తెలిసిందని, పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని మన్నెంవారి బజారులో శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన సుమారు మూడు ఎకరాల స్థలంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి ఉద్యానవనంలో బుధవారం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డిలు ఉసిరి, మామిడి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఉద్యానవనంలో జీవీఆర్ డయాబెటీస్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సహకారంతో సుమారు రూ.వేల విలువైన 200 మొక్కలు (8 రకాలు) మామిడి, ఉసిరి మొక్కలను నాటడం జరిగిందన్నారు. అతి విలువైన మూడు ఎకరాల స్థలం పక్క జగనన్న కాలనీ (టిడ్కో), మరో పక్క మన్నెంవారి బజారు, ఇంకో పక్క సీకే ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడా మైదానం ఉందని, ఇంతటి విలువైన స్థలంలో మామిడితోట, ఉసిరి వనం ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలకు మంచి ఆక్సిజన్ అందడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందించవచ్చునన్నారు. జీవీఆర్ డయాబెటీస్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఇప్పటికే మంగళగిరి నియోజకవర్గంలో గడచిన దశాబ్దకాలంలో సుమారు 50వేల మొక్కలను అందించారని, రాష్ట్రవ్యాప్తంగా లక్షకు పైగా మొక్కలను అందించాలని గుర్తు చేశారు. తన ఆసుపత్రికి వచ్చే రోగులకు చికిత్స అనంతరం డిశ్చార్జి సమయంలో వారికి మొక్కలు ఇచ్చే సాంప్రదాయం వైద్యులకు ఉండటం ఎంతైనా అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆప్కో మాజీ ఛైర్మన్ గంజి చిరంజీవి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, దేవస్థాన ఈఓ ఎ.రామకోటిరెడ్డి, శివాలయం ఛైర్‌పర్సన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక, మల్లవరపు సుధారాణి, సంకా బాలాజీ గుప్తా పాల్గొన్నారు.

ఆటస్థలంలో గ్రావెల్‌తో మెరక

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో బుధవారం గ్రావెల్ ఫిల్లింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన రహదారి కన్నా పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు మీద ఉన్న మురుగునీటితో పాటు వర్షపునీరు చేరి ఆట స్థలం చెరువులాగా మారుతుంది. వర్షం పడిన తరువాత రెండు మూడు రోజులు ఆట స్థలంలో అసెంబ్లీ నిర్వహించడానికి గానీ, విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బందిగా మారింది. ఈ మధ్య కాలంలో ఎమ్మెల్యే ఆర్కే ఈమనిలో పర్యటించిన సందర్భంగా ఈమని పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పేరెంట్స్ కమిటీ వారు ఆటస్థలంలో తరచూ నిలుస్తున్న వర్షం నీరు, మురుగునీరు గురించి చెప్పారు. వెంటనే స్పందించిన ఆయన తన సొంత ఖర్చులతో ఈమని పాఠశాలలో గ్రావెల్ ఫిల్లింగ్ చేపట్టారు. రెండు, మూడు రోజుల్లో గ్రావెల్ ఫిల్లింగ్ పూర్తికానుందని పేరెంట్స్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తెలిపారు. పాఠశాల ఆటస్థలంలో గ్రావెల్ ఫిల్లింగ్ చేయడంపై ఎమ్మెల్యే ఆర్కేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



ఈమని జడ్పీ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో తోలుతున్న గ్రావెల్

త్వరలో అందుబాటులోకి మరో 50 వెంటిలేటర్లు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలందిస్తున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం ఆసుపత్రిలో ఐసీయూలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నిత్యం రోగులకు వైద్య సేవలు అందించడానికి వీలుగా మరో 50 వెంటిలేటర్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం ఐసీయూలో 35 పడకలతో మాత్రమే వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఐసీయూలో 24 గంటలూ రోగులకు సేవలందించేందుకు అదనంగా సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. అత్యవసర వైద్య సేవల విభాగంలో ప్రత్యేకంగా తొమ్మిది మంది సీనియర్ రెసిడెంట్లను ప్రభుత్వం నియమించిందని చెప్పారు. జీజీహెచ్‌లో పీజీ వైద్యుల పాత్ర ఎంతో కీలకమని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు జూనియర్ వైద్యులు ఊపిరి పోస్తున్నారని తెలిపారు. ఐసీయూ వార్డులో సమస్యల్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తక్షణమే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తనిఖీల్లో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, అసిస్టెంట్ ఆర్ఎంవో యనమల రమేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, రాజ్యలక్ష్మి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు మహంకాళి అమ్మవారి దేవస్థానం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు నలుగురు యువకులు గూడ్సు ఆటోలో వాటర్ క్యాన్లు తరలిస్తున్నారు. ఈ సమయంలో ఆటోడ్రైవర్ రామకృష్ణతో పాటు డి.వెంకటేశ్వర్లు, అల్లూరి ఏసుబాబుతో పాటు మరో యువకుడు ప్రయాణిస్తున్నారు. కంఠంరాజు కొండూరు మహంకాళి అమ్మవారి దేవస్థానం వద్ద ఉన్న మలుపులో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏసుబాబు (20) అక్కడికక్కడే మృతి చెందగా వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా డ్రైవర్ రామకృష్ణకు స్వల్పగాయాలయ్యాయి. మృతి చెందిన ఏసుబాబుకు తండ్రి చనిపోవడంతో కుటుంబ భారాన్ని ఇతనే తీసుకుని తన తల్లిని పోషించుకుంటున్నాడు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లి శోకసంద్రంలో మునిగింది. రోడ్డు ప్రమాద సమాచారాన్ని అందుకున్న దుగ్గిరాల పోలీసులు హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఏసుబాబు మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.



మృతి చెందిన అల్లూరి ఏసుబాబు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన

వెలగపూడిలో సీసీ రోడ్లు, డ్రెయిన్‌లకు భూమిపూజ చేసిన కత్తెర సురేష్ కుమార్



సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

వెలగపూడి(తాడికొండ): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామంలో రూ.40 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ లోటు ఉన్నప్పటికీ దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా విద్య, వైద్యం, ప్రజా సేవలకు ప్రథమ ప్రాధాన్యత నిస్తూ గ్రామాల్లో ఇప్పటికే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్‌లు, నాడు – నేడు ద్వారా పాఠశాలల ఆధునికీకరణ, పేదలకు జగనన్న కాలనీలలో స్థలాలు అందులో పక్కా ఇళ్ల నిర్మాణం, ఇలా పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ఇకపై అంతర్గత సమస్యలపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. జగనన్న చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విష ప్రచారం చేయడం దుర్మార్గమని, గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి గడపలో పేదవాడి సంతోషాన్ని చూసిన మాకు రాష్ట్రంలో 175/175 స్థానాల్లో విజయం సాధిస్తామనే ధీమా ఉందన్నారు. తాడికొండ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల శేషగిరావు, శృంగారపాటి సందీప్, చలివేంద్రం సురేష్, రమణా రెడ్డి, ఆరేపల్లి జోజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌క్వాస్ గుర్తింపు కోసం మరో రెండు యూహెచ్‌సీలు

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి/ తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన తొమ్మిది డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లకు ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్) గుర్తింపు తీసుకురావడమే ధ్యేయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం, ప్రకాష్‌నగర్‌లో గల డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను పరిశీలించి ఆయా సెంటర్లలో ఎన్‌క్వాస్ గుర్తింపుకోసం చేపట్టాల్సిన పలు వైద్య సదుపాయాలపై నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ రాజేష్, డాక్టర్ మానసలతో పాటు వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్లలో కల్పిస్తున్న సౌకర్యాలపై కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు కురిపించిందన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో సంతృప్తికరమైన వైద్య సదుపాయాలతో పాటుగా నాణ్యతా ప్రమాణాలను పాటించినందుకు కార్పొరేషన్ పరిధి గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ కు రాష్ట్రంలోనే తొలి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ దక్కిందని గుర్తు చేశారు. ఎన్‌క్వాస్ గుర్తింపు నిమిత్తం కార్పొరేషన్ పరిధి యర్రబాలెం, ప్రకాష్ నగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లను ఈనెల 20 నుంచి 23వ తేదీవరకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన అధికారుల బృందం సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్‌క్వాస్ గుర్తింపు కోసం చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల విషయమై వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో చర్చించడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అభయహస్తం సీఎంఆర్ఎఫ్

నియోజకవర్గంలో రూ.3.35 లక్షల చెక్కులు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: ఆపదలో ఉన్న బాధితులకు అభయం సీఎం రిలీఫ్ ఫండ్ అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తాడికొండ నియోజకవర్గంలో వివిధ కారణాలతో ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్న బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమంతో ప్రతి పేదవాడికి మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అత్యవసర సమయాల్లో ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందలేని బాధితుల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా వేలాది కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా తాడికొండకు చెందిన అవుతు పరమేశ్వరి, యాసం వెంకటేశ్వరి, కంతేరుకు చెందిన అన్నపురెడ్డి శివలింగారెడ్డి, మందడం గ్రామానికి చెందిన ఆలూరి సామ్రాజ్యంలకు రూ.3.35 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కంతేరు సర్పంచ్ బెజ్జం మహేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతి బాగోతం బట్టబయలు

తాడికొండ: రాజధాని పేరుతో చంద్రబాబు చేసిన అవినీతి బాగోతం బట్టబయలైందని, అవినీతి కేసుల్లో బాబు ఇక జైలుకెళ్లడం ఖాయమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. బుధవారం గుంటూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోగస్ కంపెనీలను సృష్టించి వాటి ద్వారా రూ.118.96 కోట్లు లంచం రూపంలో తీసుకున్న చంద్రబాబు కోడ్ భాషద్వారా చేసిన అవినీతిపై ఐటీ శాఖ లోతుగా దర్యాప్తు చేసి నిజాలు బట్టబయలు చేసిందన్నారు. ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులకు బాబు స్పందించకుండా తనపై దర్యాప్తు చేసే అధికారం మీకు లేదని ఐటీ శాఖకు లేఖలు రాయడం ఏంటని ప్రశ్నించారు. దర్యాప్తునకు సహకరించి అధికారుల ఎదుట హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న బాబు నిజాయితీ కలవాడైతే విచారణకు హాజరై ప్రజలు, దర్యాప్తు సంస్థల ఎదుట నిజం ఒప్పుకోవాలన్నారు. దొంగ నాటకాలాడుతూ ప్రజలు, వ్యవస్థలను మభ్యపెట్టి అవినీతి కేసుల నుంచి తప్పించుకునేందుకు బాబు ఆడుతున్న దొంగ నాటకాలు బయట పడ్డాయన్నారు. ఐటీ శాఖ ఇచ్చిన నోటీసుల్లో కూడా బోగస్ కంపెనీలు, బోగస్ కాంట్రాక్టులు అని పేర్కొనడం గమనించదగ్గ విషయమని, అడ్డంగా దొరికిపోయిన దొంగ చంద్రబాబు తప్పించుకునే మార్గం లేక పిచ్చిపట్టిన వాడిలా ప్రవర్తిస్తున్నాడన్నారు. బాబు ఇక నీ బతుకు బస్టాండ్ అయిందన్న విషయం గుర్తుంచుకోవాలని, నీతో పాటు నీ కుమారుడు లోకేష్‌కు కూడా ఈ అవినీతిలో పాత్ర ఉందని రోజుకో తప్పు చేస్తూ ఎదుటి వారిపై రుద్దడం అలవాటైన బాబు ఇక జైలుకెళ్లడం ఖాయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజా రంజక పాలన చూసి ఓర్వలేక రాష్ట్రంలో తిరుగుతూ బాబు, ఆయన కుమారుడు లోకేష్‌లు ప్రభుత్వంపై బురదచల్లి రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నారని మండిపడ్డారు. బాబూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి నీవు చేసిన అవినీతిని కళ్లారా చూసిన ప్రజలు నీ కల్లబొల్లి మాటలు, కపట వేషాలు నమ్మరని, ఇకనైనా ఐటీ శాఖ అధికారుల ఎదుట హాజరై నిజం ఒప్పుకుంటే కొంతైనా శిక్ష తగ్గుతుందని సూచించారు. ప్రజారంజకపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం మానుకోవాలన్నారు. అవినీతి సామ్రాట్ చంద్రబాబు రానున్న ఎన్నికల్లో ఎన్ని పార్టీలతో కలిసి పోటీ చేసినా చిత్తుచిత్తుగా ఓటమి తప్పదన్నారు.

రూ.20లక్షలతో అభివృద్ధి పనులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ప్రధాన రహదారిలో కొత్తగా తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయడంతో కార్పొరేషన్ అధికారులు సిమెంటు రోడ్డును పగులగొట్టారు. ఆ ప్రాంతంలో రోడ్డు మరమ్మతులు, కొత్త డ్రెయిన్ నిర్మించేందుకు బుధవారం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి ప్రధాన రోడ్డులో గతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, రూ.10 లక్షలు కేటాయించి నూతనంగా 600 మీటర్లు పొడవున డ్రైనేజీ నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే తాడేపల్లి ఒకటో వార్డు నుంచి కృష్ణుడి గుడివరకు సుమారు వెయ్యి మీటర్ల పొడవున పైపులైన్ల నిమిత్తం పగులగొట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని పునర్నిర్మిస్తున్నామని, ఇందుకోసం రూ.10లక్షల నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

జొన్నలగడ్డలో క్రికెటర్ అంబటి రాయుడు సందడి

- స్థానిక ప్రజలతో మాటామంతి
- రైతులతో ముఖాముఖి



స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ చెరువు వద్ద మొక్కలు నాటారు. గ్రామంలోని విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, సచివాలయాన్ని సందర్శించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా తదితర విషయాలు తెలుసుకున్నారు. గ్రామంలోని రైతులతో ముఖాముఖి చర్చ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలకు రైతులతో చర్చించి ఏవిధంగా పరిష్కారం చూపాలో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని మంచి భవిష్యత్‌ను పొందాలని సూచించారు. గ్రామ పెద్దలతో చర్చించారు. గ్రామంలోని పలువురి ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, గ్రామ పార్టీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, వంగా నవీన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, మబ్బు సుధాకర్, గ్రామ పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం అమ్ముతున్న యువకుడు అరెస్ట్



ఫిరంగిపురం: అక్రమంగా మద్యం అమ్ముతున్న యువకుడిని బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నుదురుపాడు గ్రామంలోని పోలేరమ్మ గుడివద్ద జి.ప్రశాంత్ కుమార్ అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఎస్ఐ చల్లా కిషోర్ తన సిబ్బందితో వెళ్లి ప్రశాంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని అతడివద్ద నుంచి 40 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నరసరావుపేట కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. కోర్టు యువకుడికి 14 రోజుల రిమాండు విధించినట్లు వివరించారు.